

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో 2 సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1 నుంచి 8 వరకు దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో పొందవచ్చన్నారు. సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి గెజిటెడ్ అటెస్టేషన్ చేయించాలని తెలిపారు. 1-6-2018 నుంచి 31-5-2019 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. 11న జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

రేషన్ కార్డుల జారీ
నిరంతర ప్రక్రియ

» జిల్లా పౌరసరఫరాల అధికారి అర్వింద్‌రెడ్డి



ఫటాఫట్

నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా పౌరసరఫరాల అధికారి అర్వింద్‌రెడ్డి అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్ర: జిల్లాలో ఎన్ని కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి?

జ: ఆరు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు 11వేల 852 నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయి. పూర్తిగా వాటిని పంపిణీ చేశాం.

ప్ర: ఏఏ నియోజకవర్గంలో ఎన్ని రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి?

జ: జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గంలో 1796, బోధన్‌లో 1873, బాన్సువాడలో 1699, నిజామాబాద్ అర్బన్‌లో 3174, నిజామాబాద్ రూరల్‌లో 1616, బాల్కొండ నియోజకవర్గంలో 1694 కొత్త రేషన్‌కార్డులు మంజూరు అయ్యాయి.

ప్ర: జిల్లాలో ఎంత మంది కొత్త మెంబర్లను రేషన్ కార్డులలో యాడ్ చేశారు?

జ: 88వేల 232 మంది కొత్త మెంబర్లను రేషన్ కార్డులలో యాడ్ చేశాం.

ప్ర: నూతన రేషన్ కార్డులు మళ్లీ ఎప్పుడు జారీ చేస్తారు?

జ: రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అర్హులైన వారు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అధికారులు విచారణ జరిపి కొత్త కార్డులు ఇవ్వనున్నారు. సెప్టెంబరు నెలలో వచ్చే కోటాతో కొత్త రేషన్ కార్డుల సంఖ్య తేలనుంది. సుమారు 20వేల వరకు జిల్లాలో కొత్త రేషన్ కార్డులు పెరిగే అవకాశం ఉంది.

- నిజామాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గంట పాటు కురిసిన వర్షానికి నగరం అతలాకుతలం అయింది. ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి. గురువారం ఉదయం కురిసిన 5సెంటీమీటర్ల వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి జీవనం స్తంభించింది. ఉదయం పూట కురిసిన వానతో స్కూళ్లకు, మార్కెట్‌కు వెళ్లేందుకు జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.


• నగరంలోని రోడ్లపై ప్రవహిస్తున్న వరద ఇలా..

నిజామా'బాధ'!

5 సె.మీ. వర్షానికే అతలాకుతలం

- » వాగులను తలపించిన రోడ్లు
- » నాలాలు, డ్రెయినేజీలపై కట్టడాలు
- » లోతట్టు ప్రాంతాలు జలమయం
- » ఇళ్లల్లోకి ప్రవేశించిన వరద
- » బస్తీల్లో జనం ఆగమాగం..
- » నగర శివారులోని చెరువులన్నీ కబ్జా
- » నీరు వెళ్లేందుకు దారి లేక ఇళ్లల్లోకి వాన నీరు
- » అప్రమత్తంగా లేని యంత్రాంగం
- » గత ఘటనల నుంచి పాఠాలు నేర్వని బల్దియా


నగరంలోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన వరద

నిజామాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ వాగులను తలపించాయి. రైల్వే కమాన్ ప్రాంతంలో సుమారు అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ వర్షం పడితే నీరు నిలిచి ఇబ్బందులు వస్తాయని తెలిసిన నగర పాలక సంస్థ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో మరోసారి రైల్వే కమాన్ అండర్‌బ్రిడ్జి కింద వర్షపునీరు 5అడుగుల పైనే నిలిచిపోయింది. గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గత ఏడాది రైల్వే కమాన్ కింద వర్షపు నీటిలో ఆర్టీసీ బస్సు నిలిచిపోయిన ఘటన నుంచి బస్సులోని మిగతా 8వ పేజీలో...

వర్షానికి కూలిన ఇళ్లు.. జలమయమైన రోడ్లు

ఇందల్వాయి/ కోటగిరి/ మోపాల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండలంలోని మేగ్యానాయక్ తండాకు చెందిన దేగావత్ శ్రీనివాస్, దేగావత్ దేవేందర్‌కు చెందిన ఇళ్లు గురువారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయాయి. బాధితులు వ్యవసాయ పొలం పనులకు వెళ్లి తిరిగి వచ్చేసరికి కూలిపోయిన ఇళ్లను చూసి బోరున విలపించారు. ఇంట్లో ఉన్న సామగ్రి నీటిపాలు అయ్యింది. దీంతో బాధితులు కన్నీళ్లు పెట్టుకున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. నిజామాబాద్ నగరంలోని ఆర్యనగర్ ప్రధాన రోడ్డు గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రోడ్డు సముద్రంగా మారడంతో రాకపోకలకు స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. జిల్లాలోని శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతంతో పాటు నదులు, వాగులు పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చేపలవేట, ఈత సరదా కోసం చెరువులు, కాలువలు, కుంటలు ఇతర జలాశయాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడి సహాయక చర్యలు అవసరమైన పక్షంలో కలెక్టరేట్‌లో కొనసాగుతున్న కంట్రోల్‌రూమ్ ఫోన్‌నెం. 08462-220183కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

మహిళ రుణాల లక్ష్యం రూ.246 కోట్లు

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.240 కోట్ల రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల వ్యాపారాలకు కొత్త వారికి 25 శాతం రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పాత వ్యాపారాలకు 75 శాతం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రత్యేక రుణాలైన గేదెలు, పెరటి కోళ్లు, ఎలక్ట్రిక్ ఆటోలపై రుణాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, ఏపీడీ మధుసూదన్, నీలిమ, ప్రసాద్, కిరణ్, మోహన్, రాజేశ్వర్, అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి మమత, కోశాధికారి సూర్యజ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఉర్దూఘర్‌ను అభివృద్ధి చేస్తాం

» ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ 6

పచ్చిబుట్టకు ధరాఘాతం

- » ఆశించిన స్థాయిలో లేని ధర
- » వర్షాలు లేక పలకని రేటు
- » ఇటీవల వానలతో కొంత మెరుగు
- » మార్కెట్‌లోకి మొదట వచ్చిన మక్కకే మంచి ధర 7

అన్ని రకాల వైద్య సేవలందించాలి

» ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచాలి » విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి
» ఎస్సారెస్పీ తీరప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా చూడాలి » డొంకేశ్వర్ మండల పర్యటనలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

డొంకేశ్వర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెసీ, ఉన్నత పాఠశాల, ఎంపీడీవో కార్యాలయం, ఎరువుల గోదాంను పరిశీలించారు. పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించి సబ్ సెంటర్‌ల ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నార్మల్ డెలివరీలతో పాటు అన్ని రకాల వైద్య సేవలను అందించినప్పుడే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని హెచ్ఎంలు సురేష్ కుమార్, సబేరా బేగాంలకు ఆదేశించారు.


ఆస్పత్రిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదు చేయకపోవడాన్ని గమనించి ఎంఈవో రామకృష్ణను ప్రశ్నించారు. సహకార సంఘంలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

ఎస్సారెస్పీ తీరప్రాంతం సందర్శన..

చిన్నయానం శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఏరియాను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సందర్శించారు. పర్యాటకులు కుటుంబ సభ్యులతో వస్తుండడాన్ని గమనించి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈ రవికి సూచించారు. బ్యాక్ వాటర్ ఏరియాను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దే ప్రతిపాదనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలి

» అధికారులతో సమీక్షలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి 8


మహిళను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

చేనేత రంగానికి చేయూతనివ్వాలి

» అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు స్వామియాదవ్, గిరిబాబు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సత్యపాల్, ప్రసాద్, విజయలక్ష్మి, బీజేపీ నాయకులు కిశోర్, నాగరాజు, బొట్టు వెంకటేశ్, పల్నాటి కార్తిక్, వేరేందర్, రవి, లక్ష్మణ్, మారుతి పాల్గొన్నారు.


కాకతీయ కాలువకు నీటిని విడుదల చేస్తున్న అన్వేష్‌రెడ్డి

ఎస్సారెస్పీ సాక్షిగా రైతులపై కేసులు

» విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి
» ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల

మెండోర/ నవీపేట/ ముప్కాల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ సాక్షిగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు అడిగితే రైతులపై అక్రమ కేసులు పెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నీళ్లు అడిగిన రైతులపై ఉన్న కేసులను ఎత్తివేశారని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటిని విడుదల చేశారు. అనంతరం కాకతీయ కాలువ వద్ద ప్రత్యేక ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతులను ఆదుకోవడం కోసం ప్రాజెక్టు ప్రధాన కాలువలు అన్నిటికి నీటిని విడుదల చేస్తామని అన్నారు. ప్రాజెక్టులో తక్కువ నీటి నిల్వ ఉన్నప్పటికీ రైతుల బాగు కోసం సీఎం మిగతా 8వ పేజీలో...


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

» సబ్ కలెక్టర్ వికాస్ మహతో
» ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం తనిఖీ 6


విచారణ చేపడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్

భూ విషయంలో ఘర్షణపై విచారణ

» మోతీరాం నాయక్ తండాకు వెళ్లిన సివిల్ జడ్జి
» న్యాయం జరిగేలా చూస్తామని గిరిజనులకు హామీ 8



అంక్సాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో ఎలక్షన్ జోష్..

» అంక్సాపూర్ పాఠశాలలో విద్యార్థుల మాక్ పోలింగ్
» ఓటు హక్కుపై అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు

వేల్పూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. హెచ్ఎం మల్లీశ్వరి అధ్యక్షతన ఉపాధ్యాయులు సదాశివ్, వినోద్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యంలో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. పాఠశాలలోని విద్యార్థులు వివిధ రకాల ఎన్నికల అధికారుల ఉద్యోగ ధర్మాలను నిర్వహించారు. ఎన్నికల్లో నామినేషన్ ఎలా వేయాలి, పోలింగ్ బూత్‌లలో ఉండే అధికారుల కార్యకలాపాలు ఏ విధంగా ఉంటాయో విద్యార్థులు ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. పాఠశాల అధ్యక్ష పదవికి ఐదుగురు పోటీ చేయగా రిటర్నింగ్ ఆఫీసర్, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. పోలీస్‌లుగా, వైద్యులుగా విద్యార్థులు వేషధారణతో బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికలలో పాఠశాల ప్రెసిడెంట్‌గా ఎన్నికైన అంకితను హెచ్ఎం మల్లీశ్వరి అభినందించారు. అంకితతో ఆర్వో రుద్రతేజ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం వల్ల ఎన్నికలు ఏ విధంగా నిర్వహించాలో, ఎటువంటి నాయకుడిని ఎన్నుకోవాలో విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారని ప్రధాన ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి తెలిపారు.

డబ్బులు వస్తాయంట!

» రూ.2,500 ఖాతాలో పడుతున్నాయని ప్రచారం
» పోస్టాఫీసు వద్ద మహిళల తోపులాట

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసు వద్ద కొత్త ఖాతాలు తీసుకుంటే ప్రభుత్వం రూ.2500 మహిళల ఖాతాల్లో జమ చేస్తోందనే ప్రచారం జరగడంతో జిల్లా కేంద్రంలోని పెద్ద పోస్టాఫీసు వద్ద గురువారం మహిళలు క్యూ కట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో ఉండి ఖాతాలను తెరిచేందుకు వేచి ఉన్నారు. క్యూలో ఉన్న మహిళలు ఘర్షణతో పాటు ఒకరిపై ఒకరు దాడి చేసి పిడుగుద్దులు గుద్దుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు రూ.2500లు మహాలక్ష్మి పథకం కింద ఇస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన 18 నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఈ పథకం గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎవరో చేసిన ప్రచారం కారణంగా మహిళలు పోస్టాఫీసులకు క్యూ కడుతున్నారు.


పోస్టాఫీసు ఎదుట పొట్లాడుకుంటున్న మహిళలు

భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ఎడపల్లి,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్‌మహతో సూచించారు.ఎడపల్లితహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. భూబారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకుని, భూ సమస్యలపై వచ్చిన పలు ఫిర్యాదులను పరిశీలించారు. మండలంలో ఎలాంటి భూ సమస్యలు లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మిగతా వాటిని ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి తదితరులు ఉన్నారు.

తడి పొడి చెత్తపై అవగాహన

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ లోని 5, 6వ వార్డులలో మున్సిపల్ అధికారులు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ అధికారులు ఇంటింటికి వెళ్లి సింగిల్ యూస్ ప్లాస్టిక్ పట్ల, వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియ జేశారు. అలాగే ప్రతీ ఒక్కరు తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ ట్రాక్టర్‌కు అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ పర్యా వరణ ఇంజనీర్ పూర్ణమౌళి, హెల్త్ అసిస్టెంట్ సురేష్, వార్డు ఆఫీసర్లు సాని టరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



హెగ్డోలిలో సోయాబీన్ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోటగిరి,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): సోయాబీన్ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో గురువారం రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పంట పొలాల్లో క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోయాబీన్ పొగాకు లద్దె పురుగు, రసం పీల్చు పురుగుల నివారణ చర్యలపై క్షేత్రస్థాయి ప్రదర్శనలను సందర్శించారు. రైతు వారి పద్ధతిలో వారు చేపడుతున్న నివారణ చర్యలకు ప్రదర్శనలపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో ఆయిల్ పామ్‌లో సమగ్ర పంట యాజమాన్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉన్న నూతన సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తీరణ సంచాలకులు యాకాద్రి, శాస్త్రవేత్తలు ఇందుధర్‌రెడ్డి, శ్వేత, విజయ్‌కుమార్, ఏఈవో శంకర్, రైతులు శివకుమార్, పరమేష్, రాజేష్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఎక్లాస్‌పూర్‌లో ఇసుక డంప్‌ల సీజ్



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన తహసీల్దార్

కోటగిరి,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గురువారం తెల్లవారుజామున తహసీల్దార్ గంగాధర్ సీజ్ చేశారు. ఎక్లాస్‌పూర్ శివారులోని ఓ రైస్‌మిల్ వద్ద 8 ట్రాక్టర్ల ఇసుక డంప్, మరో చోట 8ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను తహసీల్దార్ సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసిన, డంప్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

రెంజల్,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నగుట్ట ప్రభుత్వ పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న గాదె వీరయ్యపై ఇద్దరు అనుమానిత వ్యక్తులు దాడి చేయడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో వీరన్నగుట్ట పాఠశాలలో పని చేస్తున్న వీరయ్య తాను పని చేస్తున్న సమయంలో ఇద్దరు అనుమానిత వ్యక్తులు తిరగడంతో మీరు ఎందుకు తిరుగుతున్నారని వాచ్‌మెన్ అడుగగా నువ్వు ఎందుకు అడుగుతున్నావ్ అని చెప్పి ఇద్దరు వ్యక్తులు వాచ్‌మెన్ వీరయ్యతో పాటు అతని భార్య శ్యామలపై కూడా దాడి చేయడంతో జాదవ్ రాజు, మరొక్క వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తాడ్వాయి,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో బుధవారం రాత్రిచోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన పెద్ద చెవిటి గంగయ్య ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు తాళం పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. గంగయ్య తన కూతురు ఇంటికి వెళ్లగా చోరీ జరిగినట్లు తెలిపారు. వెండి వస్తువులు బంగారం నగదు అపహరించినట్లు బాధితులు తెలిపారు. ఇంటితలుపు తెరిచి ఉండడంతో స్థానికులు సమాచారం ఇవ్వగా ఇంటి యజమాని వచ్చి చూస్తే పగిలిన బీరువా చిందర వందరగా వస్తువులు పడి ఉండడంతో దొంగతనంగా నిర్ధారించారు. దొంగలు తాళాలు వేసిన ఇంటినే టార్గెట్ చేస్తున్నారని పలువురు అంటున్నారు.పోలీసులువచ్చిఇంటిలో ఫింగర్‌ప్రింట్ నమూనాలు సేకరిస్తున్నారు.

40 మంది వాహన చోదకులకు జరిమానా

బీర్కూర్,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని 40 మంది వాహన చోదకులకు జరిమానాలు విధించినట్లు పోలీ సులు తెలిపారు. పలువురికి జరిమానాలు విధించారు.అలాగేమద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒక వాహనదారుడికి డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

బోధన్,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామానికి చెందిన మారుబాయి(105)శతాధిక వృద్ధురాలు గురువారం ఉదయం మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వెయ్యికి పైగా ప్రసవాలు చేసిందని పేర్కొన్నారు. ఆమెకు గ్రామంలో మంచి పేరు ఉందన్నారు.

కష్టపడి పని చేసిన వారికే గుర్తింపు

కోటగిరి,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో కష్టపడి పని చేసిన వారికే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని కోటగిరి తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు.కోటగిరి మండల సమాఖ్య ఏపీఎంగా బస్వంత్‌రావు పదేళ్లకుపైగా పని చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు శ్రీనివాస్ రెడ్డి, చందర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, సీసీలు విఠల్, సాయిబాబా, గంగారాం, రమేష్, రమాదేవి, సుజాత, రాజు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి రూ.51వేల సహాయం

ఏర్గట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చిమ్మెన వందరి గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతోమృతి చెందగా గురువారం తనతో చదువుకున్న 2002-2003 బ్యాచ్‌మిత్రులు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం కింద రూ.51వేలు అందజేశారు. అంతే కాకుండా వారికుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో 2002-2003 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కంపల్లి సెజ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



స్విచ్ ఆన్ చేసి నీటి విడుదల చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే

నందిపేట,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం లక్కంపల్లి సెజ్‌భూముల్లో రూ.20వేల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆర్మూర్‌ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నందిపేట మండలం ఉమ్మెడ గోదావరి శివారులో ఉన్న అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేశారు.స్విచ్ ఆన్ చేసి మోటార్లు, పంపులను ప్రారంభించారు.ఈసం దర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయకుంటే భూములను రైతులకు పంచి పెట్టాలన్నారు.ఆనాటి ఉమ్మడిఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ ఉన్నప్పుడు గుత్పలిఫ్ట్‌ను నిర్మించి రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి లక్కంపల్లి సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజల గుండెల్లో నిలవాలనిరాకేష్‌రెడ్డి ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతి పక్షంపైగానీ నాయకులపైగానీ ప్రేమలేకున్నా ప్రజలపైజాలిచూపి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. గుత్పలిఫ్ట్‌ద్వారా ఆర్మూర్, బాల్కొండ నియోజక వర్గాల్లోని 6 మండలాల్లో సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. రైతులు విడతల వారిగా సాగు నీటిని వాడుకోవాలని, వంతుల వారిగా చెరువులు నింపుకోవాలని ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి కోరారు. నిజాం సాగర్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా అధికారులుచర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు పటేళ్ళ రాజు, బీజేపీ సీనియర్ నాయకులు లక్కంపల్లి చిన్నయ్య, రవీందర్, భూతం సాయరెడ్డి, గడ్డంచిన్నారెడ్డి, నాగ తారక, ఇరిగేషన్ అధికారులు తదితరులు ఉన్నారు.

మాక్లూర్: హిందూ ధర్మం ఉన్నాన్ని రోజులు ఆచార సంప్రదాయాలు, మానవత విలువలు ఉంటాయని, హిందూ ధర్మాన్ని ప్రతీ ఒక్కరికి వివరిస్తూ హిందూ ధర్మాన్ని ఆచరించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని కృష్ణానగర్ తండాలో శ్రీరాముల ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ధ్వజస్తంబానికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోని ఆలయాలలో నిత్యంపూజలునిర్వహించాలని చిన్న తండా అయిన ఆలాభివృద్ధికి గ్రామస్థులందరు ఏకంకావటం అభినందనీయమని సనాతనధర్మం పట్ల ప్రతీఒక్కరు కుటుంబ సభ్యులకు వారి పిల్లలకు తెలిసేలా చెప్పాలని ఆయన అన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మదారి మమత, సీనియర్ నాయకులు రమేష్ నాయక్, గోపురి ఒడ్డెన్న, సురేష్ నాయక్, నర్సింగ్‌రావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పిల్లవాడికి అల్బెండజోల్ మాత్రలు వేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్

సాలూర,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):అల్బెండజోల్ మాత్రాలను ప్రతిపిల్లవాడికి వేయాలని సాలూర మెడికల్ ఆఫీసర్ డాక్టర్‌రాజ్‌కుమార్ సూచించారు.గురువారం సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన ఆసుపత్రి సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆల్బెండజోల్ మాత్రలను ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.1నుంచి 19సంవత్సరాల లోపు పిల్లలకు నులి పురుగుల నివారణ మందులను తప్పనిసరిగా వేయాలని కోరారు. ముందస్తుగానే సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. కళాశాల, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రుల సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్:మండల కేంద్రంలో జాతీయ నులిపురుగుల దినం సందర్భంగా మండలంలోని ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. ఆగస్టు 11న అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండర్ జోల్ వేయించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో హాజరై ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో దేగాం ప్రాథమికఆరోగ్య కేంద్ర సిబ్బంది, అన్నిపాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు వేయించాలని మెడికల్‌ఆఫీసర్ రక్షితఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురవారం మండల కేంద్రంలోని రైతు వేది కలో అంగన్‌వాడీ నిర్వాహకులకు, ఏఎన్‌ఎమ్‌లకు,ఆశా కార్యకర్తలకు, పాఠశాలల అధ్యాపకులకు నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల వల్ల జరిగే నష్టాలు, పిల్లల పోషకాహార లోపం, బరువు తగ్గడం, అజీర్తిగా ఉండటం, కడుపులో మంట వంటి లక్షణాలు ఉంటాయని వాటి నివారణకై అల్బెండజోల్ మాత్రలు 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా వేయించేలా చూడాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి శివకృష్ణ,ఎంపీడీవో వెంకటేశ్వర్లు,ఎంఈవో ఆనంద్‌రావు, ఎంపీవో శివచరణ్, విజయ, పండరిమోహన్‌లు పాల్గొన్నారు.

వేల్పూర్:వేల్పూర్‌ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలోగురువారం నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు.నులిపురుగుల వల్లకలిగే వ్యాధులు, వాటి నివారణపైవైద్యులు సూచనలు ఇచ్చారు.ఈసందర్భంగా నులిపురుగుల నివారణమందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మీనా,శరత్‌చంద్ర, టీఎస్‌వో నారాయణ, ఆశవర్కర్లు,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న దృశ్యం

కోటగిరి,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో పద్మ పేర్కొన్నారు.కోటగిరి మండల కేంద్రంలోని జరీనా కాలనీలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివని పేర్కొన్నారు. తల్లిపాల అవశ్యకత, ప్రయోజనాలపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిపాల ప్రభావం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన చిన్నారులకు అన్నప్రాసనా, అక్షరాభ్యాసం, సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కొమురవ్వ, గోపిలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సాలూర: సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భవతులకు సీమంతాలు చేశారు. 7నెలలు నిండిన బిడ్డలకు అన్నప్రాసన చేశారు. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలను ఆరు నెలల పాటు తాగించడం వలన బిడ్డలకు కలిగేటువంటి లాభాలను వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమన్ బాయి, గర్భవతులు, తల్లులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలి

సాలూర,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, సాలూర ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం సాలూర మండలం కుమ్మన్‌పల్లి గ్రామంలో నిర్మాణాలను చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, క్షేత్రసహాయకుడు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు.గురువారం కమ్మర్‌పల్లి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సంబంధితశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు.ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెటరవి, నాయకులు బుచ్చిచల్లయ్య,సింగిరెడ్డి శేఖర్,సల్లూరి గణేష్‌గౌడ్,కార్యదర్శి గంగాజమున, ఈజీఎస్‌ఫీల్డ్ అసిస్టెంట్‌రమ,ఇందిరమ్మకమిటీసభ్యులు, మహిళసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

రుద్రూరు,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో జాతీయ వేదిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మోత్కూరి నారాయణ, ఉపాధ్యక్షులు గోనే దత్తాత్రి, డైరెక్టర్లు గంగుల శంకర్, పుల్లె లక్ష్మి, ఎన్.గణేష్, మాజీ డైరెక్టర్ జువ్వల పోతన్న, పికారి గంగాధర్, ఈర్వ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి

జక్రాన్‌పల్లి,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీజిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పిలుపునిచ్చారు. గురు వారం జక్రాన్‌పల్లిలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు.స్థానికసంస్థల ఎన్నికల్లో అన్నిగ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందేందుకు కార్యకర్తలు సైనికులుగా పనిచేయాల న్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లిప్రసాద్,కిసాన్‌మోర్చ జిల్లాఅధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ నాయ కులు సంజీవ్‌గౌడ్,శ్రీనివాస్‌గౌడ్, విక్రమ్, క్యాతంరాజారెడ్డి, జైడిగంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చ మండల అధ్యక్షుడిగా మోహన్‌నాయక్

జక్రాన్‌పల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ ఎస్టీ మోర్చ అధ్యక్షుడిగా మండలంలోని గన్యతండా గ్రామానికి చెందిన అజ్మీర మోహన్‌నాయక్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం మోహన్‌నాయక్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి ప్రకటించారు. ఈకార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్,రాజారెడ్డి,గంగారెడ్డి పాల్గొన్నారు.

పసుపు పంటను మద్దతు ధర జాబితాలో చేర్చాలి

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర జాబితాలో చేర్చాలని, ఇండియాన్ ఇన్‌స్టూట్ ఆండ్ స్పైసెస్ రీసర్చ్‌ను ఏర్పాటు చేయాలని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ అర్వింద్‌కు సొంత ప్రయోజనాలు తప్ప నిజామాబాద్ పార్లమెంట్ అభివృద్ధి పట్టడం లేదని మాజీ ఎంపీ మధుయాష్కి హాయంలో నిజామాబాద్ జగదల్‌పూర్ జాతీయ రహదారి 63 ను నాలుగు లైన్‌లుగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసి మంజూరు చేయించారని పదకొండు ఏళ్లైన జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా కార్యరూపం దాల్చలేదని దీనికి ఎంపీ అర్వింద్ అసమర్థతే కారణమని అన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేశెట్టి నీరజ్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బట్టు శంకర్, మీసాల రవి, శ్రీకాంత్, షేక్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఉర్దూఘర్‌ను అభివృద్ధి చేస్తాం

● ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్



బోధన్‌లో మాట్లాడుతున్న ఉర్దూ అకాడమీ చైర్మన్

బోధన్,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ప్రభుత్వం నుంచి సరిపడ నిధులు మంజూరు చేసి తీసుకువచ్చే బాధ్యత తనదని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పేర్కొన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఉర్దూఘర్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉర్దూఘర్ కమిటీ సభ్యులు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూఘర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనన్నారు.కొంతమంది పాత ఉర్దూహాల్ అభివృద్ధి చేయడం కన్నా నూతన నిర్మాణాన్ని చేపట్టాలని అడిగారని వాటిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఈకార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బోధన్ ఉర్దూఘర్ చైర్మన్ బ్యాటరీబాబా పాల్గొన్నారు.

సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలి

ఏర్గట్ల, ఆగష్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలను వినియోగించుకోవాలని డివిజన్ ఉద్యాన అధికారి రుద్ర వినాయక్, మండల వ్యవసాయాధికారి వైష్ణవ్ తెలిపారు. గురువారం మండలంలోని దోంచంద గ్రామంలో ఆయిల్ పామ్ సాగు వాటి వల్ల వచ్చే లాభాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లరాంపూర్ సొసైటీ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, ఏఈవో సాయిసచిన్, ప్రేమ్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

దేగాంలో సైబర్‌క్రైం షీటీంల అవగాహన సదస్సు

ఆలూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేగాం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈవ్ టీజింగ్ చేస్తే షీటీంలకు సమాచారం ఇవ్వాలని ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్‌టీజింగ్ చేసిన షీటీం కు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుల్ విగ్నేష్, సుమతిలు అన్నారు. సైబర్ క్రైం గురించి విద్యార్థు లకు అవగాహన సదస్సు నిర్వహించారు.సమాచారం ఇచ్చినమహిళలు, విద్యార్థుల పేర్లు గోప్యం షీ టీం నంబర్ 8712659795, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని లేదా క్యూఆర్ కోడ్ ద్వారా షీటీం వారికి చేసే విదానాన్ని మహిళలకు, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డికే ఇందుమతి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పని కల్పించాలని వినతి

కమ్మర్‌పల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు చేతినిండ పని కల్పించాలని కోరుతూ కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలోని సీజేపటేల్ బీడీ కంపెనీ మేనేజర్‌కు గురువారం తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ కమ్మర్‌పల్లి ఏరియా కమిటి కార్యదర్శి సత్తెమ్మ, జిల్లా నాయకులు కే. రాజేశ్వర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయుసీఐ నాయకులు బి. అశోక్, బీడీ ప్యాకర్స్ కే. మురళి, సునీల్, ప్రకాష్, మధు, పరమేశ్వర్, గంగాధర్, రాకేష్ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

● రూ. 34 వేల, 17 సెల్‌ఫోన్లు పట్టివేత ● 20 మంది అరెస్టు

మద్నూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో బిచ్కుంద సీఐ ఆధ్వర్యంలో గురువారం పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. మద్నూర్ మండలం పెద్ద శక్కర్గ, డోంగ్లి మండలం మదన్ హిప్పర్గా, గ్రామాలలో నడుస్తున్న పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు మద్నూర్ ఎస్సై విజయకొండ తెలిపారు. పోలీసుల దాడుల్లో మదన్ హిప్పర్గాలో 20 మంది, రూ. 32,600 నగదు, 17 సెల్‌ఫోన్లు, పెద్ద శక్కర్గాలో నలుగురు, 1400 రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు

తడపాకల్ జడ్పీ హైస్కూల్‌లో రక్షాబంధన్

ఏర్గట్ల/ముప్కాల్/ఆర్మూర్‌టౌన్,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి) : మండలం లోని తడపాకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం తెలిపారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, రవి,చక్రపాణి,కృష్ణప్రసాద్, దేవానంద్‌గౌడ్,భూపతి,విజయ, విద్యార్థులు పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని మదర్‌థెరీసా, వెంకటేశ్వర్ హైస్కూల్‌లో రాఖీ సంబురాలు అంబరాన్ని తాకాయి. గురువారం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని అన్నా చెల్లిలు అనురాగానికి ప్రతీరూపంగా రాఖీని విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈకార్యక్రమంలో సుబ్బారెడ్డి, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ భవన్‌లో న్యాయ వాదులు రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది లోక భూపతిరెడ్డి రక్షాబందన్ ప్రాముఖ్యతను వివరించారు.ఈకార్యక్రమంలో బార్‌అసోసియేషన్‌సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భూభారతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ముప్కాల్,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై దరఖాస్తు చేసుకున్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా బాల్కొండ తహసీల్దార్‌కు సూచించారు. గురువారం బాల్కొండ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇటీవల భూభారతిలో వచ్చిన దరఖాస్తులు ఎన్ని, ఇప్పటి వరకు అందులో ఎన్ని పరిష్కారం అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

బాల్కొండ జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఒడ్డెన్న

ముప్కాల్,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం డీఈవో రవికుమార్, ఇంటర్మీడియల్ స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెనతో కలిసి కళాశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాసంవత్సరంకు సంబంధించి అడ్మిషన్లను పెంచాలని సూచించారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని,విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందుతున్నాయా అనిఅడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రజియొద్దీన్ అస్లాం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జూడోలో నందిపేట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం అరుణ్

నందిపేట,ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓహైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చారు.క్యాడెట్ విభాగంలో సిద్దూనాయక్ (10వ) 50 కిలోల బరువు క్యాటగిరిలో రజత పతకం సాధించారు. అలాగే రిషిత రాజ్ (9వ) 57కిలోల బరువు క్యాటగిరిలో రజత పథకం అలాగే పూజిత (9వ) 63 కిలోల బరువు క్యాటగిరిలో రజత పతకం సాధించారు. వీరికి తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు కైలాస్ యాదవ్ పతకాలను అందజేశారు. ఈసందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్ఎం గోజూరి అరుణ్, పీఈటీ వికాష్, నవీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి



వంటగదిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఏర్గట్ల,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలని ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. గురువారం మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు, ఎస్సీ బాలుర వసతి గృహం, కేజీబీవీ పాఠశాలలను తనిఖీ చేశారు.ఈసందర్భంగా వసతిగృహాల్లో వంట గదులను పరిశీలించి శానిటేషన్ మెరుగు పరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో, కార్యదర్శి పాల్గొన్నారు.

విద్యార్థుల మాక్ పోలింగ్

వేల్పూర్,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. స్థానిక హెచ్ఎం మల్లీశ్వరి అధ్యక్షతన ఉపాధ్యాయులు సదాశివ్, వినోద్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యంలో భాగంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈకార్య క్రమంవల్ల ఎన్నికలుఏవిధంగా నిర్వహించాలో, ఎటువంటి నాయకున్ని ఎన్నుకోవాలని ప్రత్యక్షంగా తెలుసుకున్నారని హెచ్ఎం అన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

జక్రాన్‌పల్లి,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లిలో శుభోదయం పాఠశాలలో గురువారం దివ్యాంగ విద్యార్థులుకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహిం చారు. అనంతరం దివ్యాంగుల విద్యార్థులకు ఫిజియోథెరపిస్టు డాక్టర్ సిందూ ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు రమేష్, రిసోర్స్ టీచర్స్ స్వామి, సీఆర్‌పీలు సత్యనారాయణ, నాగేష్ సునంద, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై కుక్కలు గుంపుగా ఉన్న దృశ్యం

హున్సాలో కుక్కల స్వైర విహారం

- భయాందోళనలో ప్రయాణికులు, స్థానికులు
- నియంత్రణ కోసం చర్యలు తీసుకోవాలంటూ ఆవేదన

సాలూర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హున్సా గ్రామంలో కుక్కల స్వైర విహారం ఇంతకింతకు పెరుగుతుంది. గ్రామస్థులు, ప్రయాణికులు రోడ్డుపై తిరగాలంటే భయాందోళనకు గురికావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మోటారు సైకిలు, వాహనదారులు ప్రయాణం సాగించే సమయంలో కుక్కలు వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గ్రామ అధికారులు తక్షణ చర్యగా కుక్కల స్వైర విహారాన్ని నియంత్రించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. కుక్కల దాడిలో అనేక మంది గాయాల పాలైన విషయం తెలిసింది. కుక్కలు దాడి చేసే వరకు కుక్కల స్వైర విహారాన్ని నియంత్రించరా అంటూ ప్రయాణికులు, ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సమయంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు మండిపడుతున్నారు. ముసలి ముతక రోడ్డుపై తిరగలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కుక్కల నియంత్రణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ప్రొటోకాల్ విస్మరిస్తున్నారని ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమ్‌గల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కార్యాలయ సిబ్బంది ప్రొటోకాల్ విస్మరిస్తున్నాయని బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. మహిళా సంఘాలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వాల ద్వారా అందిస్తున్న రుణాలను మహిళా సంఘాలకు అందజేసి ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది రాజకీయ నాయకులను ఆహ్వానించి వారి చేతుల మీదుగా పంపిణీ చేయిస్తు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తోట గంగాధర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు బండారి లక్ష్మణ్‌గౌడ్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు రామావత్ వెంకటేష్, శక్తి కేంద్ర ప్రముఖ్ హరిప్రసాద్, దడివే లక్ష్మీ, నారాయణ, బీజేవైఎం నాయకులు శెట్టి ప్రేమ్ చంద్ ఉన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి



భోజనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

బోధన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సాలూర మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలో గల సాలూర పరిధికి చెందిన జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి సంబంధించిన హాజరు బుక్కులను పరిశీలించారు. పాఠశాలలోని సౌకర్యాలను విద్యార్థులకు, విద్యార్థినిలకు విద్యా బోధన వివరాలను విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనశాలను పరిశీలించారు. భోజనం మరియు నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. భోజనశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించిన సహించేది లేదని హెచ్చరించారు.

పచ్చి బుట్టకు ధరాఘాతం

- వర్షాలు లేకపోవడంతో ధర పలకని వైనం
- ఇటీవల కురిసిన వర్షాలతో కొద్దిగా పెరిగిన ధర
- మార్కెట్‌లోకి మొదట వచ్చిన పచ్చి మక్క బుట్టకు మంచి ధర

ఆర్మూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నుంచి 63 వ జాతీయ రహదారి వెంబడి ఇతర జిల్లాలైన నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు అంకాపూర్ గ్రామంలో ఆగాల్సిందే. నోరూరించే కాల్చిన మొక్కజొన్న కంకులను కొనుగోలు చేయడమే కాకుండా పచ్చిబుట్టను తీసుకువెళ్తుంటారు. అంకాపూర్ మొక్కజొన్న పచ్చిబుట్టకు ఉన్న డిమాండ్ ఇది. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామం మక్కజొన్న పచ్చిబుట్ట విక్రయాలకు రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచింది.

పచ్చి బుట్టకు పుట్టినిల్లు .. అంకాపూర్

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామం పచ్చిబుట్ట సాగుకు పుట్టినిల్లుగా భావిస్తారు. ప్రతీ సంవత్సరం వందల ఎకరాల్లో ఈ పచ్చిబుట్ట సాగు చేసి అనంతరం ఇతర పంటలను సాగు చేస్తుంటారు. ఈ సంవత్సరం సుమారు 375ఎకరాల్లో పచ్చి బుట్టను సాగు చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం ముందు వచ్చిన పంటకు ధర అధికంగా పలుకుతుంది. ఈ యేడు మార్కెట్‌లోకి ముందుగా వచ్చిన పచ్చిబుట్టకు మంచి ధర వచ్చింది. ఆటో ట్రాలికీ 10 నుంచి 14వేల వరకు ధర పలికి రైతుకు ఎకరాన లక్షకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. అనంతరం ధర తగ్గడంతో ప్రస్తుతం ఆటో ట్రాలికీ 6 వేల నుంచి 7వేల వరకు పలుకుతుంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే పచ్చిబుట్టకు డిమాండ్ పెరుగుతుంది. వర్షాలు కురియకపోవడంతో పచ్చిబుట్టకు ఆశించిన ధర రాక రైతులకు నిరుత్సాహాన్ని మిగిల్చింది.

ఇతర రాష్ట్రాలకు సరఫరా ..

అంకాపూర్ గ్రామం నుంచి మక్కజొన్న పచ్చిబుట్ట నాగ్‌పూర్, మహారాష్ట్రంలోని పలు నగరాలకు, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు నిత్యం రవాణా జరుగుతుంది. ఉదయం వేళలో మార్కెట్ చిన్న, పెద్ద వ్యాపారులతో కళకళలాడుతుంది. లారీలలో మొక్కజొన్న పచ్చిబుట్ట సంచులను లోడ్ చేసి ఇతర రాష్ట్రాలకు, నగరాలకు తరలిస్తుంటారు.



అంకాపూర్‌లో పచ్చిబుట్టను కొనుగోలు చేస్తున్న ప్రజలు

చిన్న వ్యాపారులకు జీవనోపాధి..

అంకాపూర్ గ్రామంలో పచ్చిబుట్ట సాగు విక్రయం వల్ల చిన్నవ్యాపారులకు సైతం జీవనోపాధిగా మారింది. జూన్ నెల చివరిలో మార్కెట్‌లోకి వచ్చి సెప్టెంబరు వరకు అమ్మకాలు జరుగుతాయి. ఇక్కడి నుంచి పచ్చిబుట్ట రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు సరఫరా అవుతుంటాయి. నిత్యం వ్యాపారులు వచ్చి మక్కబుట్టను కొనుగోలు చేస్తుంటారు. ఉదయమే చిరువ్యాపారులు కంకులను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తారు. కొందరు గ్రామంలోనే జాతీయ రహదారి వద్ద మొక్కజొన్న కంకులను కాల్చి అమ్ముతుంటారు. సుమారు 40కిపైగా కుటుంబాలు పరోక్షంగా అనేక మంది కూలీలు దీనిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు.



అంకాపూర్ మార్కెట్‌లో పచ్చిబుట్ట రాశులు

వర్షాలు లేకపోవడంతో ధర తగ్గింది..

- వెంకట్‌రెడ్డి రైతు, అంకాపూర్



మొక్కజొన్న పచ్చిబుట్ట సాగు చేసిన రైతులకు ఈ సారి ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదు. మార్కెట్‌లోకి ముందుగా వచ్చిన పచ్చిబుట్టకు ధర రావడంతో రైతులు లాభపడ్డారు. అనంతరం ధర తగ్గడంతో రైతులకు అరకొర లాభాలే మిగిలాయి. ప్రస్తుతం ఆటో ట్రాలీ రూ.6వేలు పలుకుతుంది. ధరను బట్టి ఒక్కొక్క రైతుకు ఎకరాన కనిష్టంగా 50 నుంచి 60 వేలు గరిష్టంగా లక్ష రూపాయల వరకు ఆదాయం వచ్చాయి.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- మార్కెట్ కమిటీ అధికారులతో సమీక్షలో గడుగు

మోపాల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మార్కెట్ కమిటీ తెలంగాణలోని అతిపెద్ద మార్కెట్ కమిటీ అని ఇక్కడికి వచ్చే రైతులను ఇబ్బందులు పెట్టవద్దని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ సూచించారు. గురువారం నిజామాబాద్ మార్కెట్ కమిటీలో వ్యవసాయ, మార్కెట్ కమిటీ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, వైస్ చైర్మన్ రాంచందర్, డైరెక్టర్లతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి వచ్చే రైతులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా, దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. మార్కెట్ కమిటీ ఔట్‌గేట్, ఇన్‌గేట్ రికార్డులను సక్రమంగా చూసుకోవాలన్నారు. 25 ఏళ్లుగా మార్కెట్ కమిటీలో సెక్యూరిటీ గార్డ్ టెండర్ ఒకరికే ఉండటం సరికాదని అగ్రిమెంట్ పూర్తికాగానే టెండర్ పిలవాలన్నారు. రెన్యూవల్ చేయకుండా టెండర్ ద్వారా ఎవరైనా దక్కించుకోవచ్చన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మార్కెట్ కమిటీ కార్యవర్గం ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. రైతులు మార్కెట్ యార్డుకు వచ్చినప్పుడు అధికారులు, ట్రేడర్లు ఇబ్బందులు పెడితే తగిన చర్యలు ఉంటాయన్నారు. వరి కాకుండా ప్రత్యమ్నాయంగా రైతులు ఆయిల్‌పామ్, ఇతర ఆరుతడి పంటల వైపు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. ఆయిల్‌ఫామ్ పంటను 10వేల ఎకరాలకు పైగా సాగు చేస్తే జిల్లాకు ఫ్యాక్టరీ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి అపర్ణ, ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు

విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



సదాశివనగర్ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

సదాశివనగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువును తల్లిదండ్రులు గమనిస్తూ కళాశాలలో బోధిస్తున్న పాఠ్యాంశాల వివరాలు, హోంవర్క్, తదితర విషయాలపై తల్లిదండ్రులు ఆరా తీస్తూ విద్యార్థులు బాగా చదివేందుకు ప్రోత్సహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింగం శ్రీనివాస్ అన్నారు. గురువారం సదాశివనగర్ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మార్కుల వివరాలు, హాజరును తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించడానికి అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల సహకారం ఎంతో ముఖ్యమైందన్నారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా విద్యార్థులను ప్రతిరోజు కళాశాలకు పంపించే విదంగా కృషిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మౌలిక వస తులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఫిజిక్స్ ఆన్‌లైన్ డిజిటల్ తరగతులు, ప్రయోగశాలలను చూసి వారు సంతోషించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. జిల్లాలోని శ్రీరాంసాగర్ పరివాహక ప్రాంతంతో పాటు నదులు, వాగులు పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని తెలిపారు. చేపలవేట, ఈత సరదా కోసం చెరువులు, కాలువలు, కుంటలు ఇతర జలాశయాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగకుండా ఉండేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, తక్షణ పర్యవేక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించామని తెలిపారు. భారీ వర్షాల వల్ల ఎక్కడైనా ప్రమాదం ఎదురైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడి సహాయక చర్యలు అవసరమైన పక్షంలో కలెక్టరేట్‌లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08462-220183కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

నెమ్లి సాయిబాబా ఆలయంలో పూజలు

నసురుల్లాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి ఆలయంలో గురువారం భక్తులు సాయి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ నెమ్లి సాయి ఆలయం మినీ షిర్డీగా అవతరించిందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నెమ్లి సాయి బాబా



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగలు

మాదిగలను బహిష్కరించిన వీడీసీ సభ్యులపై చర్యలు తీసుకోవాలి

- ఏసీపీ కార్యాలయం ఎదుట ధర్నా

ఆర్మూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో మాదిగల కులస్థులను బహిష్కరించిన వీడీసీ సభ్యులపై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆర్మూర్ ఏసీపీ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ కులస్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జి మైలారం బాలు మాట్లాడుతూ గ్రామంలో మాదిగల కులస్థుల వాటాతో నిర్మించిన 11 మడిగెల్లో తమకు ఒక మడిగే ఇవ్వాలని కోరిన మాదిగ కులస్థులను బహిష్కరించడం ఎంతవరకు సమంజసమన్నారు. మాదిగలను కులీ పనులకు పిలవడం లేదని, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు పంపడం లే దని, వీడీసీ కమిటీ ఆగడాలు పెరిగిపోయాయన్నారు. ఇలాంటి చర్యలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మైలారం రాము, ఇందారపు రాజు, సట్లపల్లి గణేష్, మల్కన్న, సంజయ్, వినోద్, సుధాకర్, సవిత, గంగాధర్, మాదిగ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై నెట్టేసి కాంగ్రెస్ తప్పించుకోవాలని చూస్తుంది

- కాంగ్రెస్ ధర్నాకు ఎవరి మద్దతు లేదు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి పటేల్



మాట్లాడుతున్న దినేష్

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వంపై నెట్టేసి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి పటేల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ లక్ష్యం అన్నారు. బీసీలకు న్యాయం చేసింది బీజేపీ మాత్రమేనని తెలిపారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ఇచ్చి మైనార్టీ రిజర్వేషన్ అమలు చేయడం కోసమని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ బీసీల కోసం ఏం పనిచేశారో చెప్పాలని ప్రశ్నించారు. బీసీల ఓట్లతో గెలిచి మైనార్టీ వర్గాలకే పదవులు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తుందన్నారు. కాంగ్రెస్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేసిన ధర్నాకు ఎవరి మద్దతు లేదన్నారు. ధర్నాలో ఒక్క బీసీ కూడా లేదని అన్నారు. ఢిల్లీలో ఉండి కాంగ్రెస్ అధినాయకత్వం ధర్నాకు రాలేదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను బీజేపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. బీసీల మీద ఉన్న ద్వేషంతోనే కాంగ్రెస్ మైనార్టీలను చొప్పించి రిజర్వేషన్ ప్రక్రియ చేసిందన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో రిజర్వేషన్‌ను పాటించలేదన్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే 42 శాతంలో ఉన్న ముస్లింలను తీసివేయాలన్నారు. కేంద్రం నుంచి ఆమోదం తెచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, కొండ ఆశన్న, ఆమందు విజయ్, రాంచందర్, మాస్టర్ శంకర్, సంతోష్, ముత్యాలు, నారాయణయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మల్లేష్‌గుప్త, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తూ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు సమన్వయంతో పనిచేస్తూ మంచి ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న ఆదేశించారు. గురువారం నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చేరిన బడుగు బలహీన మైనార్టీ విద్యార్థినిల అభ్యున్నతికి అధ్యాపకులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్‌బోర్డు కమీషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. ప్రతిభలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువుకునే విధంగా ఆసక్తి కలిగించాలని సూచించారు. కళాశాలకు హాజరుకాకుండా ఆప్‌సెంట్ అయిన వారి సమాచారం తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా అందించాలని తెలిపారు. కళాశాలలో జరుగుతున్న విద్యాబోధనపై స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్, ప్రిన్సిపల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

మెడికిల్ షాపులు

- ప్రజల అవసరాన్ని క్యాష్ చేసుకుంటున్న వ్యాపారులు
- అర్హత లేనివారితో వ్యాపారం
- అధికారుల తనిఖీలు శూన్యం

బాన్సువాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ప్రవేటు మెడికల్ షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా మందును ప్రజలకు అంటడగుతూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు.. ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చేసుకుంటున్నారు. బాన్సువాడ మండల పరిధిలో ఉన్న మెడికల్ దుకాణాలు నిబంధనలకు అనుగుణంగా లేకున్నా సంబంధిత అధికారులను మచ్చిగ చేసుకుని తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రజల అనారోగ్యాన్ని క్యాష్ చేసుకుని మెడికల్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

నిబంధనలకు పాతర

బాన్సువాడ పరిధిలోని మెడికల్ షాపుల నిర్వాహకులు మెడికల్ నిర్వహణకు లైసెన్స్‌లను ఇతరుల నుంచి కొనుగోలు చేసుకుని మెడికల్ పరిజ్ఞానం అనుభవం లేని యువతీ, యువకులతో తక్కువ వేతనాన్ని ఇచ్చి నడిపిస్తుండటంతో ప్రజలకు ముప్పు ఏర్పడుతుంది. యాంటీ బయోటిక్ వంటి మందులను బిల్లు లేకుండానే అమ్మడంతో ప్రజల్లో ఆరోగ్య సమస్యలు, సైడ్ ఎఫెక్ట్ పెరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నప్పటికీ మెడికల్ షాపుల నిర్వాహకులు యథేచ్ఛగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. వైద్యులు రాసిన చీటీ లేకుండా మందులను ఇవ్వడంతో పాటుగా కాలం చెల్లిన మందులను ప్రజలకు అంటగట్టడంతో గ్రామాల్లో మెడికల్ షాపు నిర్వాహకులను ప్రజలు నిలదీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీలను మెడికల్ షాపుల నిర్వాహకులు మచ్చిక చేసుకుని వారికి కమీషన్లను ముట్టచెబుతూ లక్షల్లో దందాను కొనసాగిస్తూ దినదినాభివృద్ధి చెందుతున్నారు.

సంబంధిత అధికారుల తనిఖీలు శూన్యం..

గ్రామాల్లో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న మెడికల్ దుకాణాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయా లేదా అని క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ వారికి ముడుపులు తీసుకుని మెడికల్ నిర్వహకులకే అనుకూలంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో మెడికల్ వ్యాపారులు చాలామంది నిబంధనలను తుంగలోతొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రోగుల జేబులకు చిల్లి పెడుతున్నారు. వైద్యులు రూ.300ల నామమాత్రపు ఫీజుతో రోగికి పరీక్షలు చేస్తే సుమారు రూ.1000వరకు మెడికల్ షాపులో ఖర్చు పెట్టాల్సి వస్తుందని రోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ మెడికల్ దుకాణంపై సంబంధిత అధికారుల ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



భూంపల్లిలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్సై పుష్పరాజ్

ప్రమాదాల నివారణకు తనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు

సదాశివనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 44వ జాతీయ రహదారి భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ నుంచి సదాశివనగర్ మండలంలోని దగ్గి శివారు ప్రాంతం వరకు విస్తరించి ఉంది. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలతో రహదారి రక్తసిక్తం అవుతూనే ఉంది. దీనికి రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారే కారణమవుతున్నారు. దీంతో సదాశివనగర్ సర్కిల్ పరిధిలో సీఐ సంతోష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సదాశివనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో గత జనవరి నుంచి ఇప్పటివరకు డ్రంకెన్ డ్రైవ్‌లో 245 కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. పేకాటకు సంబంధించి రెండు కేసులు, బహిరంగ మద్య పానం చేసిన 20 మందిపై కేసులు నమోదుచేశారు.

AJ CLASSIFIEDS

WANTED DISTRIBUTOR

★ డీలర్స్ కావలెను: ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ వారి EV స్కూటర్లు కొరకు జిల్లా & మండల స్థాయిలో డీలర్లు కావలెను. ఆసక్తిమున్నవారు సంప్రదించగలరు. ఫోన్: 7607812456 AJH- 35009

CHANGE OF NAME

I, KOLLOLLA ASHOK KUMAR (OLD NAME) R/O HNO: 3-1-129, TATTIKOT, BODHAN, NIZAMABAD, TS. I HAVE CHANGED MY NAME AS KOLLOLA ASHOK (NEW NAME) S/O KOLLOLA SAILU AJZ

CHANGE OF NAME

I, SHAIK BABU JOHNI S/O HAMAD HUSSAIN (OLD NAME) H.NO.1-15-552, VAMBAY COLONY, KAMAREDDY, (DT) : KAMAREDDY TG. HAVE CHANGED MY NAME IS SHAIK BABU JANI S/O SHAIK AHMED HUSSAIN (NEW NAME) AJZ

పాస్‌పోర్ట్ పోయినది

కొకట్ల అనిల్ S/O కొకట్ల మైసయ్య R/O HNO. 17-108/1, సుబాష్‌రోడ్ గ్రా. మం. బిచుకొండ, జి. కామారెడ్డి (TG) నాయొక్క పాస్‌పోర్ట్ నెం. Y4947822 గండి ఇల్లు షిఫ్టింగ్ చేస్తుండగా పోయినది లభించినవారు సం. సం. 9948192782 AJZ

LOSS OF PASSPORT

THAMMALA SRINIVAS S/O DASU R/O NYAVANANDI, SIRIKONDA (M), NIZAMABAD,T.G, HAVE LOST MY ORGINAL PASSPORT NO. (B7159486) WHILE TRAVELLING FROM NYAVANANDI TO SIRIKONDA MANDAL ON BIKE IF FOUND PLZ CONTACT 9059303836 AJZ

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453



ఢిల్లీలో సీఎంతో భూపతిరెడ్డి, శేఖర్‌గౌడ్

ఢిల్లీలో సీఎంను కలిసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, శేఖర్‌గౌడ్

నిజామాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల కోసం బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్‌లు గురువారం ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని రాష్ట్రపతి ఆమోదం పొందేవరకు కాంగ్రెస్ తరఫున పోరాడాలని కోరారు. ప్రభుత్వ పరంగా అనుమతి రాని పక్షంలో పార్టీ పరంగా బీసీలకు పార్టీ పదవుల్లో 42 శాతం పదవులు దక్కేలా చూడాలని సీఎంను కోరారు.

భూ విషయంలో ఘర్షణపై విచారణ

- మోతీరాం నాయక్ తండాకు వెళ్లిన సివిల్ న్యాయాధికారి
- న్యాయం జరిగేలా చూస్తామని హామీ

మోపాల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మోతీరాంనాయక్ తండాలో గిరిజనులకు, ఫారెస్టు అధికారుల మధ్య జరిగిన ఘర్షణపై గురువారం న్యాయసేవా అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్, న్యాయవాదులు విచారణకు వెళ్లారు. తాండాకు చెందిన ప్రకాష్ ఎన్ని సంవత్సరాల నుంచి భూమిని సాగు చేస్తున్నాడు, చేస్తున్నప్పుడు ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి కారణాలు ఏంటివి దానిపై విచారణకు వెళ్లారు. ప్రకాష్ పంట వేసే ముందు ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకున్నట్లయితే పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదని సూచించారు. ప్రకాష్ సాగు చేస్తున్న భూమి ఫారెస్టు భూమి లేక రెవెన్యూ భూమి అని ఆరా తీశారు. ఈ సంఘటనపై విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా చూస్తామని ఇరువురికి భరోసా ఇచ్చారు. తండావాసులతో పాటు ఫారెస్టు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో న్యాయమూర్తి విచారించారు. డజ్జితో పాటు న్యాయవాదులు బాల్‌రాజ్ నాయక్, ఆశనారాయణ, రవిప్రసాద్, సంస్థ సూపరింటెండెంట్ శైలజ, సిబ్బంది అనురాగ్, స్థానిక నాయకులు ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు చవాన్, మోహన్ నాయక్, మోపాల్ మండల మాజీ జెడ్పీటీసీ, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ నాయక్, ఏబీఎస్ఎస్‌యు ఇందల్ నాయక్, జలేందర్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గౌతం, తదితరులు ఉన్నారు.

కార్మికులకు చేతినిండా పని కల్పించాలి

సిరికొండ ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సాబ్లెవాగ్రే బీడీ కంపనీలో పనులు చేస్తున్న కూలీలందరికి చేతినిండా పని కల్పించాలని కోరుతూ కంపని ప్రతినిధికి వినతి పత్రాన్ని అందజేస్తున్న టీయూసీఐ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలో గల సాబ్లెవాగ్రే బీడీ కంపనిలో పని చేసే కార్మికులకు పని కల్పించకుండా మొండి చేయి చూపిస్తున్నదని టీయూసీఐ జిల్లా కార్యదర్శి రమేష్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులుపాల్గొన్నారు.

డిచ్‌పల్లి ఈవోగా గంగాధర్ బాధ్యతల స్వీకరణ

డిచ్‌పల్లి,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి మేజర్ పంచాయతీ ఈవోగా గడ్కోల్ గంగాధర్ గురువారం ఇన్‌చార్జి కార్యదర్శి రాధిక నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. గంగాధర్ పూర్తిస్థాయి ఈవోగా బాధ్యతలు చేపట్టారు.

నులిపురుగు నివారణపై విద్యార్థులకు అవగాహన

డిచ్‌పల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):జాతీయ నులిపురుగుదినోత్సవం సందర్భంగా డిచ్‌పల్లి 30 పడకల ఆసుపత్రిలో ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాలకు చెందిన విద్యార్థులకు కళాశాలల అధ్యాపకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వైద్యాధికారిణి క్రిస్టినా పాల్గొని మాట్లాడారు. 1-19 సంవత్సరాలలోపు చిన్నారులకు ఆల్బడజోలం మాత్రలు వేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సౌత్ క్యాంపస్‌లో గత నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని సౌత్ క్యాంపస్‌లో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు సంజీవ్ డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడిందని అట్టి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, మోక్షిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీడీ యాజమాన్య మొండి వైఖరి నశించాలి:టీయూసీఐ

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):శివాజీ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికుల సమస్య పరిష్కరించాలని టీయూసీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వర్, వెంకన్న, సుధాకర్, మల్లేష్, కిషన్, సాయిరెడ్డి, మురళి, కిరణ్, రవికుమార్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా రామాగౌడ్

సుభాష్‌నగర్,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బీసీ,ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా రామాగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ సలహాదారులుగా గంగాధర్‌గౌడ్, కోకన్వీనర్‌లుగా రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్‌కమిటీసభ్యులుగా షేక్‌హుస్సేన్, సుదర్శన్, ప్రమోద్, భోజన్న, ఒడ్డెన్న, భరత్, రాజేశ్వర్, రాజేష్, రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూభారతి ఫైళ్లను త్వరగా క్లియర్ చేయాలి

సిరికొండ ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : భూభారతి ఫైళ్లను త్వరగా పూర్తి చేయాలని మండల రెవెన్యూ అధికారులను నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ ఆదేశించారు. గురువారం సిరికొండ తహసీల్దార్ కార్యలయాన్ని ఆర్డీవో ఆకస్మికంగా సందర్శించారు, ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు గంగారాజం,నాగన్న ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలను కమీషనర్ దిలీప్‌కుమార్ గురువారం పరిశీలించారు. నగరంలోని శివాజీనగర్, వినాయక్‌నగర్, కంఠేశ్వర్, ఎల్లమ్మగుట్ట, రైల్వేకమాన్, విద్యుత్‌నగర్, గౌతంనగర్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షం కురవడంతో డ్రైనేజీలను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఆయన వెంట మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, సానిటరి ఇన్స్‌పెక్టర్లు ఉన్నారు.

ఇండస్ట్రియల్ ఏరియాలో వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలు

మోపాల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలను నిర్వహించారు. రాయితీ యూరియాను పరిశ్రమలో వాడకంపై తనిఖీలు చేశారు. యూరియాను పక్కదారి పట్టకుండా జిల్లాలోని పలు పరిశ్రమలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయితీ యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమలో రాయితీ యూరియాను వాడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారి మహేందర్‌రెడ్డి, ఏఈవో చక్రపాణి ఉన్నారు.

నిజామా'బాధ'..

(5వ పేజీ తరువాయి)

ప్రయాణికులను పోలీసులు కష్టపడి బయటకు తీసిన ఘటనను మరువక ముందే మళ్లీ గురువారం సైతం అదే పరిస్థితి నెలకొంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో వరద చుట్టుముట్టేసింది. నగరంలోని బోధన్ రోడ్, మాలపల్లి, ఆటోనగర్, ఎరుకలబస్తీ, కొజాకాలనీ, నగరంలోని గౌతంనగర్, తదితర ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వర్షపునీరు, మురికి నీరు చేరడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. హైదరాబాద్, ముంబై మహానగరాల్లో భారీ వర్షాలు వస్తే ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు క్రమ క్రమంగా నగరంలోనూ కనిపిస్తున్నాయి.

అక్రమ కట్టడాలతోనే తంటా..

నగరంలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో చిన్నపాటి వర్షానికే నగరం వర్షం నీటితో నిండుతోంది. వరద వెళ్లేందుకు నాలాలు నిర్మించినా వాటిపై అక్రమ కట్టడాలు ఉండటంతో వర్షపునీరు సాఫీగా వెళ్లలేక ఇళ్లలోకి చేరుతోంది. ఎప్పుడో మునిసి పాలిటీ ఉన్నప్పుడు ఉన్న నాలాల వ్యవస్థ రోజురోజుకి నగరం విస్తరిస్తున్న క్రమంలో వరదనీరును తట్టుకోలేక పోతున్నాయి. ప్రస్తుతం ఉన్న నాలాలు 10 మిల్లీమీటర్లకు పైన వర్షం పడితేనే తట్టుకోలేని పరిస్థితుల్లో ఉండగా గురువారం కురిసిన 5 సెంటీమీటర్ల వర్షానికి నాలాలన్నీ నిండిపోయి రోడ్లపైకి వర్షం నీరు ప్రవహించాయి. అక్రమ కట్టడాలను తొలగించేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు నాలాల పక్కన నివసించే వారు భయం భయంగా కాలం గడిపే పరిస్థితి ఉంది. గత ఏడాది సాయినగర్ కాలనీలో మూడేళ్ల చిన్నారి నాలాలో పడి మృతి చెందినా అధికారులు గుణపాఠం నేర్వలేదు. అంతకుముందు సైతం నగరంలో నాలాలలో చిన్నారులు పడి మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. డ్రెయినేజీలను సైతం కబ్జా చేసి నిర్మాణాలు చేస్తుం డటంతో వర్షం నీరు బయటకు వెళ్లలేక కాలనీలను ముంచెత్తుతోంది.

నగర శివారు చెరువులన్నీ కబ్జా..

నగరం రోజురోజుకి విస్తరిస్తున్న తరుణంలో అనేక శివారు కాలనీలు వెలుస్తున్నాయి. గతంలో పంట పొలాలన్నీ ఇప్పుడు వెంచర్లుగా మారి ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. గతంలో నగరం చుట్టూ పూలాంగ్ వాగు, రామర్తి చెరువు, నిజాంసాగర్ కాలువ, ఇతరత్ర చిన్న చిన్న కాలువలు పెద్దవిగా ఉండేవి. వర్షం పడితే వరదనీరు ఆ కాలువల ద్వారా పూలాంగ్ వాగులో కలిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుతాయి. నగరం విస్తరిస్తున్న క్రమంలో పూలాంగ్



కిరాణ షాపు చుట్టూ చేరిన వరద

వాగుతో పాటు రామర్తి చెరువు కబ్జాకు గురవుతూ వస్తుంది. పూలాంగ్ వాగు వెంట కట్టడాలు పెరిగిపోతుండటంతో అది రోజు రోజుకూ కుదించుకుపోతోంది. వాగుల వెంట ఇంటి నిర్మాణం కోసం సెట్‌బ్యాక్‌లు వదిలిన తర్వాతనే అనుమతులు ఇవ్వాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇస్తుండటంతో యథేచ్ఛగా వాగుల వెంట అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. బోధన్ రోడ్‌లోని రామర్తి చెరువు విస్తీర్ణం మొత్తం 32 ఎకరాలు కాగా ప్రస్తుతం 6 ఎకరాలు మాత్రమే విస్తీర్ణం ఉందంటే ఆ చెరువు ఏ మేరకు కబ్జాకు గురైందో తెలుస్తుంది. మాలపల్లి, హైమద్‌పుర కాలనీ, నటరాజ్ థియేటర్ వెనుక నుంచి మిర్చీకంపౌండ్ వైపు డి-54 కాలువ పూర్తిగా కబ్జాకు గురైంది. ఖిల్లా ప్రాంతంలోని బొడ్డెమ్మ చెరువు సైతం ఆక్రమాలకు గురవుతుంది. ఇలా నగ ర శివారులోని చెరువులన్నీ కబ్జాకు గురికావడంతో వర్షంనీరు ఎక్కడికి వెళ్లలేక నగరంలోని లోతట్టు ప్రాంతాలకు చేరుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేసే వారే కరువు..

నగరంలోని ప్రధాన వీధులగుండా వర్షం నీరు కొత్త కలెక్టరేట్ వెనుకగల నీటిశుద్ధి కేంద్రానికి చేరుకుంటుంది. నగరంలోని ఖిల్లారోడ్, బోధన్‌రోడ్, గంజ్ మీదుగా దుబ్బ ప్రాంతంలో ఈ డ్రైనేజీ ఉంది. ఈ డ్రైనేజీని శుభ్రం చేసే వారే లేకపోవడంతో వర్షం నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లోని వరదనీరంతా ఈ కాలువ ద్వారానే నీటి శుద్ధి కేంద్రానికి చేరుతుండ గా చాలా చోట్ల డ్రైనేజీ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. గంజ్ ప్రాంతం వరకు మాత్రమే సీసీ డ్రైనేజీ ఉండగా అక్కడి నుంచి కేవలం మట్టి కాలువలు ఉండటంతో అది రోజురోజుకు కుదించుకపోయి వర్షం నీరు సక్రమంగా వెళ్లడం లేదు. నగరంలోని గౌతంనగర్ నుంచి బైపాస్ వెళ్లే రోడ్డులో డ్రైనేజీ అసంపూర్తిగా వదిలేయడంతో ఆ ప్రాంతంలోనే వర్షం నీరు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. నాందేవ్‌వాడ, హమాల్‌వాడి, పంబౌడి, సుభాష్‌నగర్, రాజీవ్‌నగర్, అంబేద్కర్ కాలనీ ప్రాంతాల్లోని వరదనీరంతా వెళ్లేందుకు సరైన కాల్వల వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరంతా ఇళ్లలోకి చేరుతోంది. కలెక్టరేట్ సమీపంలోని జన్మభూమి రోడ్డు, బైపాస్ డ్రెయినేజీ వ్యవస్థకు కల్వర్టు నిర్మాణం చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు.

తూతూ మంత్రంగా గ్రామసభ

మహమ్మద్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసన్‌పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించిన గ్రామసభను అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లో సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. మురికికాలువలు, వీధి దీపాలు, పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, లోవోల్టేజ్‌తో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి చాటింపు లేకుండా కొందరిని పిలుచుకుని గ్రామసభ నిర్వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ గ్రామసభకు ప్రత్యే క అధికారి సాయితేజతో పాటుగా పలు శాఖ అధికారులు హాజరుకాలేదు. గ్రామసభకు అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాభివృద్ధి కుంటుపడిందని ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

సుభాష్‌నగర్,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో గురువారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ తెల్లవారుజామున 4గంటలకు నిద్రలేచి నగర వీధులను శుభ్రం చేసే కార్మికులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. కార్మికులకు చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పండగ సెలవులు, అంబేద్కర్ జయంతి, గాంధీ జయంతి, కార్మిక దినోత్సవం సెలవులు లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. కనీస వేతనం 26వేలు ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గత సంవత్సరం నుంచి అనేకసార్లు వినతులు సమర్పించిన స్పందించడం లేదన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ది రాములు, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, యూనియన్ నాయకులు మేకల రాజేందర్, అనిల్ కుమార్, గంగాశంకర్, లక్ష్మణ్, నవీన్, వెంకటస్వామి, ప్రవీణ్, రాము, రాహుల్, మురళి, శ్రీశైలం, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

● డిప్యూటీ కమిషనర్ రవిబాబును తక్షణమే సస్పెండ్ చేయాలి

మున్సిపల్ కార్మికులు వర్షంలో తడుస్తుంటే రవిబాబు రెయిన్‌కోట్ పై ఉండి కార్మికుడితో గొడుగు పట్టించుకొని పెత్తందారులా వ్యవహరిస్తున్న డిప్యూటీ కమీషనర్ రవిబాబుపై చర్యలు తీసుకోవాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. డిప్యూటీ కమీషనర్‌ను కార్యాలయంలో వెళ్లి ప్రశ్నిస్తే తన ఇష్టం వచ్చినట్లు చేస్తానని రెవెన్యూ సెక్షన్ కోసం డబ్బులు ఇచ్చి వస్తే సానిటేషన్ సెక్షన్ ఇచ్చారని అంటున్నాడని తెలిపారు.

● డిప్యూటీ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి: టీయూసీఐ డిమాండ్

మున్సిపల్ కార్మికులపట్ల అధికారుల వివక్షతనునిర్లక్ష్య వైఖరిని టీయూసీఐతీవ్రంగా ఖండిస్తుందని టీయూసీఐజిల్లా కార్యదర్శి అన్నారు.

● డిప్యూటీ కమీషనర్ చర్యపై సోషల్ మీడియాలో వైరల్

డిప్యూటీ కమీషనర్ రవికుమార్ వర్షంలో రెయిన్‌కోట్ వేసుకొని కార్మికుడితో గొడుగుపట్టించుకోవడంపై సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉదయం నుంచి వివిధ వాట్సాప్ గ్రూపులలో, సోషల్ మీడియాలలో ఫోటోలు షేర్ చేసి డిప్యూటీ కమీషనర్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. రెయిన్‌కోట్ ఉండి గొడుగు పట్టించుకోవడం, వర్షంలో కార్మికుడు తడుస్తున్న దృష్యాన్ని చూసి డిప్యూటీ కమీషనర్‌పై మండిపడుతున్నారు. కమీషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సారెస్పీ సాక్షిగా రైతులపై కేసులు

(5వ పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగునీరు ఇస్తుందని అన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. పంటల కోసం విడుదల చేస్తున్న నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులను ఆదుకో వడం కోసం ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తా, ఈఈ చక్రపాణి, వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నర్సారెడ్డి, జక్క రాజేశ్వర్, రొట్టె సంతోష్‌కుమార్, కట్కం రమేష్, కిరణ్, సుమో రాజేశ్వర్, సాగర్, సాయరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలీసాగర్ ఎత్తిపోతల నుంచి..

నవీపేట మండలం కోస్లీలోని గోదావరి ఒడ్డున ఉన్న అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా గురువారం ఆయకట్టుకు ఇరిగేషన్ ఈఈ బలరాం సాగునీటిని విడుదల చేశారు. ఈ మేరకు స్టేజ్-1 వద్ద ఉన్న పంప్‌హౌస్‌లో ఆయన స్విచ్‌ఆన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత్తం ఎస్సారెస్పీలో 41టీఎంసీల నీరు నిల్వ ఉండగా అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా వానాకాలం సీజన్‌కు సంబంధించి 2.4టీఎంసీల నీటిని ఆయకట్టుకు అందించడానికి ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేశారని ఆయన పేర్కొన్నారు. రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. నవీపేట, రెంజల్, ఎడపల్లి, నిజామాబాద్, డిచ్‌పల్లి, మాక్లూర్ మండలాలకు చెందిన సుమారు 49,803 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీకాలువ ద్వారా..

వానాకాలం పంట కోసం లక్ష్మీకాలువ ద్వారా విత్తనాభివృది సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అధికారులతో కలిసి గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకొని సాగుచేసుకోవాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువలో ఒకటైన వరద కాలువ నుంచి అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. 3 వేల క్యూసెక్కుల ద్వారా దిగువకు వదిలారు.



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

డబుల్ బెడ్ రూం ఇళ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలి

కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్గల్ మున్సిపల్ పట్టణాలలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి విద్యుత్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్బన్ ఏరియాలలో పెండింగ్‌లో ఉన్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిధులు అందుబాటులో ఉన్నందున, విద్యుత్ కనెక్షన్లు, మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న కల్వర్టులు, రోడ్లు, వంతెనల పనులను వేగవంతంగా జరిపించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఒక్కో పని వారీగా పనుల ప్రగతిని కలెక్టర్ సమీక్షిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలలో అదనపు తరగతి గదులు, టాయిలెట్స్ పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. న్యాయాధికారుల భవనాలకు, ఆర్అండ్‌బీ అతిథి గృహంకు మరమ్మతులను గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జీజీహెచ్ ఆసుపత్రిలో లీకేజీలు, ఫ్లోరింగ్, కిటికీల అద్దాల మరమ్మతులు కూడా వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధిత శాఖల ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉచిత యజ్ఞోపవిత అందజేత

నిజామాబాద్‌కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో గురువారం యజ్ఞోపవితాలను ఉచితంగా అందజేశారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల గీతాభవన్‌లో జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంఘ నాయకులు యుగందర్ యజ్ఞోపవితాలను బ్రాహ్మణులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని నాగారం పూజారికాలనీ, సీతారాంనగర్ కాలనీ, వినాయక్‌నగర్, కంఠేశ్వర్, సుభాష్‌నగర్, పెద్దబజార్, ఆర్యనగర్, తదితర ప్రాంతాల్లో యజ్ఞోపవితాలను ఉచితంగా అందజేసినట్లుతెలిపారు. యజ్ఞోపవితాలను శుక్రవారం రైల్వే స్టేషన్ రోడ్‌లోగలగీతాభవన్‌లో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చంద్రశేఖర్ శర్మ, రణదీశ్, రాంప్రసాద్, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిరికొండ ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలంలోని గోప్య తండా నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు సిరికొండ పోలీస్‌లు వెళ్లి పట్టుకున్నారు. కా మారెడ్డి తరలించడానికి చంద్రుదేవుని ఆలయం వద్ద ఇసుకతో ఉన్న రెండు ట్రా క్టర్లను పట్టుకుని సిరికొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.తండాకు చెందిన ఇద్ద రు ప్రభుత్వ అనమతి లేకుండ ఇ సుకను తరలిస్తున్నారని పోలీస్ జవాను ఒకరు చెప్పారు.రెండు ట్రాక్టర్ల పై కేసు నమోదు చేశారు.ఎస్సైని సంప్రదించడానికి ప్రయత్నించగా స్పందించలేరు.

కార్మికుల సమస్యల పరిష్కారం

నిజామాబాద్‌కల్చరల్,ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):కార్మిక సంఘాలు పోరాట ఫలితంగా నేశిసాగర్ అండ్ సాబ్లే బీడీ యాజమాన్యం రెండురోజుల పనిదినాల పెంపుదలకు ఒప్పుకున్నాయనిబీఎల్‌టీయూ నాయకులు సిద్ధిరాములు తెలిపారు.గురువారం వివిధ ప్రాంతాలలో బీడీ కార్మికులతోనిర్వహించినసమావేశంలో ఆయన మాట్లాడుతూ యాజమాన్యాలు కార్మికుల సమస్యలపైస్పందించి చర్చలకు పిలువాలన్నారు.ఈ బీడీ కార్మిక నాయకులు,కార్మికులు ఉన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Bodhan Branch** agreed to accord Loan to Gosula Satish S/o Gosula Raghu, Occ:Business, R/o H.No.6-112, Neela (V) Renjal (M), Nizamabad (Dist) (Borrower) by mortgage of the schedule referred property of **Gosula Raghu.** The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

The NALA converted Open land in Sy No.606/P4 (Ac.00-041/4 gts), Sy No.606/P3/1 (Ac.00-01 gts), Sy No.606/P3/4 (Ac.00-01 gts) Sy No.606/P3/2 (Ac.00-01 Gts), Sy.No.606/P3/3 (Ac.00-01 gts), Total Area 00-08 1/4 gts **equal to 998.25 Sq.Yds**, situated at abutting to 100-0" Wide Main Road (Satapur to Kandakurthi) NEELA Village Shivar, Mandal: Renjal, Dist: Nizamabad.

As Bounded by

North : Own Land of G.Raghu, **South :** Land of Sulthan, **East :** R&B 100'-0" wide Road (Satapur to Kandakurthi), **West :** Land of Sri B.P.Gangadhar

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409

NOTICE TO SHOW CAUSE (GENERAL FORM)
IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT NIRMAL
I.A.NO. 288 OF 2023 IN O.S.NO.37 OF 2009

Between:
Narsod Sayanna & others ...Petitioners/Plaintiffs
AND
Narsod Rama Rao alias **Ramulu** (Died) per his L.Rs. ...Respondent/Defendant

To
R-20 Parsi Venkataramana S/o. Narsimulu, Aged about 47 Years, Occ: Business, R/o H.No. 5-6-317, Saraswathinagar, Nizamabad.

WHEREAS the above named petitioner has made an application to this Court, to pass Final Decree, you are hereby warned to appear in this Court in person or through advocate duly instructed on the **25th day of August 2025 at 10.30 AM** to show cause against the application, failing which the said application will be heard and determined exparte.

// PUBLISHED AS PER THE ORDERS OF THE HON'BLE COURT //

Sd/- B.SHUBHAKARAN
B.Sc., LLB., Advocate,
Priyadarshini Nagar,
Nirmal Dist. - 504106 (TG)

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.230	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,01,100	రూ.93,300	రూ.1210

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మహావతార్ నరసింహ (11.05, 1.55, 8.00, 10.50)
: బకాసుర రెస్టారెంట్ (4.45)
స్క్రీన్-3 : మహావతార నరసింహ (10.10)
: సయ్యార (హిందీ) (1.00)
: కింగ్డమ్ (4.10, 10.15)
: వెపన్స్ (ఇంగ్లీష్) (7.25)
స్క్రీన్-4 : మాత్ర (11.30)
: వెపన్స్ (ఇంగ్లీష్) (2.10)
: రాజుగాని సవాల్ (5.00)
: మహావతార నరసింహ (7.30)
: బకాసుర రెస్టారెంట్ (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కింగ్డమ్ (1.30, 7.30)
స్క్రీన్-2 : రాజుగాని సవాల్ (11.00)
: సూ ఫ్రమ్ సో (1.40, 4.30, 10.30)
: బకాసుర రెస్టారెంట్ (7.30)
స్క్రీన్-3 : మహావతార్ నరసింహ (11.00, 1.40, 4.30, 7.30, 10.30)

దేవి : మహావతార నరసింహ (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హరిహర వీరమల్లు (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : బకాసుర రెస్టారెంట్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: కింగ్డమ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్